కథానిక

# చిన్ని శారదకు పెద్ద బహుమానం

"విశ్వామిత్ర"

హరికథ జోరుగా సాగుతోంది. హరిదాసు చెప్పే పిట్టకథల్ని సావధానంగా వింటూ ప్రతివారూ తమ ప్రక్కవాళ్లు ఏంచేస్తున్నారో కూడా తెలుసుకోలేని తన్మయావస్థలో వున్నారు.

శారద మనసులో తుపాను ... "అమ్మ చెప్పింది. దొంగతనం చేయకూడదని. ఇది దొంగతనమెలా ఔతుంది. దొరికింది. దాన్ని తను తీసుకోవటానికి తనకి సర్వహక్కులూ వున్నయ్. కాకపోతే ఎవరైనా "నాది" అంటే ఇచ్చెయ్యొచ్చు. ఏమో, లేకపోతే మాత్రం తను ఆ స్టేజి దగ్గరికెళ్లి అది ఎవరిదో కనుక్కుని ఎందుకిచ్చెయ్యకూడదూ? పాపం! ఇది పారేసుకున్నవాళ్ళు ఎంత ఏడుస్తున్నారో? ఆపిల్ల అమ్మ ఆ అమ్మాయిని ఏమంటూందో? అంటే మాత్రం తనకేం? ఏమైనాసరే ఇది తీసేసుకోవాలి. అది తీసుకొంటే సమృద్ధిగా గుడ్డలు కొనేసుకోవచ్చు. హాయిగా బతకొచ్చు. ఛీ! ఎవరిదో సొమ్ము. తనెందుకు తీసుకోవాలి? ఐనా అమ్మ ఇదివరకు చెప్పింది, ఏదైనా దొరికినా అది వాళ్ళకి ఇచ్చెయ్యాలని."

ఎదురుగా కనపడుతున్న "నెక్లెసు" మీద గభాలున పరికిణీ కప్పేసింది శారద.

హరికథ జరుగుతోంది. కాని అది శారద చెవుల్లో వినిపించటం లేదు. జనం కిటకిట లాడుతున్నారు, అందరూ సిల్కు పరికిణీలు, జాకెట్లు కట్టుకుని సీతాకోక చిలుకల్లా ఇటు అటు సందడిగా తిరుగుతున్నారు.

శారద తన జాకెట్ వంకా, వోణీవంకా పరికిణీ వంకా చూసుకుంది. అది కట్టుకుని ఐదారు రోజులవటం వల్ల మాసి, చెమటకంపు కొడుతున్నయ్. కాని ఆమె కొత్త వాసననీ మిగతా అందరి సువాసనలూ కప్పేసినయ్. మొత్తంమీద సెంటు వాసనలు ప్రతిమూల నుంచీ తెరలు తెరలుగా కొట్టుకొస్తున్నయ్. ఆ వాసనలకి శారద చిన్నమనసు ఊగిపోయింది. ఆ వాసనల్ని తనెందుకు పోషించకూడదు? తలుచుకుంటే ఐదు నిమిషాల్లో...

ఎవరో ఒకావిడ చిన్నపిల్లనెత్తుకుని అటు ప్రక్కగా వెళ్లింది. శారదకి తన చిన్నతనం జ్ఞాపకం వొచ్చింది.

అదృష్టం గల ఆరోజుల్లో తనకి ఓ అమ్మ వుండేది. ఎన్నో చెప్పేది. తనకి ఎన్నో చేసేది; తనెప్పుడూ అమ్మమాట వినకండా వుండలేదు. అమ్మ చాలాసార్లు చెప్పింది, దొంగతనం చేయకూడదనీ, చేస్తే పాపమనీ, పైగా అందరూ నీచంగా చూస్తారనీ... ఇంకా ఎన్నో.

అమ్మ ఎందుకు చచ్చిపోయింది? వేదాంతులు చెప్పటం, కర్మఅని. కానీ కాదు. అదంతా శుద్ధ అబద్ధం. అమ్మమందులేక చచ్చిపోయింది.

"ఆ "నగ"ని కళ్లారా ఇంకోసారి చూడాలనుకొని జాగ్రత్తగా గుడ్డ తొలిగించి చూసింది. శారద మనసులో భావాలు రంగులు పూసుకొని మెరుస్తున్నయ్. అనుమానం, అందరూ తన వంకే చూస్తున్నారనీ. కాని ఎవరూ చూట్టంలేదు. తనే అందరివంకా అనుమానంగా చూస్తోంది.

"...ఇప్పుడు అమ్మ లేదుగా ఎందుకింకా ఇది తీసుకునిమాత్రం ఏం ప్రయోజనం?..." అని ఓసారనుకుంది.

దాన్ని చూస్తుంటే భయంవేసింది శారదకి. చెమట విపరీతంగా పోసింది.

..."ఎందుకిచ్చేయాలి. పారేసుకోవటానికి అంత వొళ్లు పొగరా? అంత అశ్రద్ధా? ఇది చేయించుకొన్నావిడ ఇలాటిది ఇంకోటి చేయించుకోలేదూ?... ఐనా ఇప్పుడిస్తే మళ్ళీ ఇంకోమారు పారేసుకుంటుంది. ఇవ్వకపోతే ఇహ జాగ్రత్తగా వుంటుంది. ఏమైనా సరే ఇది తను తీసేసుకోవాలి" అనుకుంది శారద.

"ఛీ, నాది కానప్పుడు నేనెందుకు తీసుకోవాలి. దీనిమీద నాకేం హక్కుంది? వాళ్లు జాగ్రత్తగా వుంచుకుంటే నాకేం, వుంచుకోకపోతే నాకేం? పోనీ దానివంక చూడకుండా నాదోవన నే వెళ్ళిపోతే! అది మాత్రం ఏమైంది, ఇస్తే ఉపకారం చేసినట్లన్నా అవుతుంది. లేకపోతే నేను కాకపోతే ఇంకొకళ్లు తీసుకొంటారు. ఎవరిదో కనుక్కొని ఇచ్చేయటం మంచిది." అని తీర్మానించుకుని నగ జాగ్రత్తగా చేత్తో పట్టుకుని నుంచోబోతోంది. ఇంతలో ఒకమూల ఏదో గోల బయల్దేరింది. వెంటనే మైక్ దగ్గిరకొచ్చి వొకాయన "నెక్లెస్ పోయింది, అది వెతికిచ్చినవాళ్ళకి పదిరూపాయిలు బహుమానం" అని చెప్పి ఆ నెక్లెస్‌ని కొంతసేపు వర్ణించాడు. ఈ హడావుడిలో ఏం చేయటానికి తోచలేదు శారదకి. వెంటనే చెప్పేస్తే అంత వెంటనే చెప్పేస్తే అప్పుడే ఎలా దొరికిందనీ, ఇందాకనే దొరికితే ఎందుకు చెప్పలేదనీ" ఇవన్నీ అడుగుతారని తెలిసి అర్థంగాక జనం వంక అమాయికంగా చూస్తోంది శారద. పరధ్యానంలో "నగ"ను గుడ్డ చాటునుంచి బైటికితీసిన సంగతిని మరిచిపోయింది.

ఓ పెద్దకేక వినపడ్డది. కాళ్లు వొణుకుతున్నయ్ శారదకి. "అదుగో నెక్లెస్. పట్టుకోండి ఆ అమ్మాయి చేతిలో" చాలా కొద్దిసేపట్లో శారద స్టేజిదగ్గిరికి తీసుకురాబడింది. ముట్టుకోడానికే అసహ్యమేస్తున్నట్టు ముఖాలుపెట్టి అందరూ కొంచెం దూరంలో నిలబడి "చెప్పు ఎందుకు తీశావు?" అని గదమాయిస్తున్నారు.

తనకి చెప్పటానికి భయంవేసింది. అయినా చెప్పకపోతే పరిస్థితి ఇంకా తీవ్రం కాగలదని "నేను తియ్యలేదు నాకు దొరికింది." అని అస్పష్టంగా వొణుకుతూ చెప్పింది.

"పాపం! దొరికిందేం! ఎవరి మెళ్ళోదైనో!" వ్యంగంగా వినపడిన ఈ మాటలకి శారదకి వొళ్లు మండింది.

"నేను కూచున్న చోటే దొరికింది." అని కోపంగా ముఖం పెట్టి అంది.

ఒకడన్నాడు, "చూశాం గనక దొరికింది లేకపోతే అది మనకి దొరికేదికాదు."

మరొకడన్నాడు, "చూస్తే దొంగ, చూడకపోతే దొర."

తను చేసిన తప్పేమిటో బోధపడ్లేదు శారదకి. తను ఇందాకటినుంచి దాన్ని జాగ్రత్తగా కాపాడినందుకు తనని ఎందుకు బహూకరించరు? పైగా ఏమిటీ వేళాకోళాలు?"

తను అడగలేదని ఇవ్వటంలేదేమో బహుమానం బహుశా. పోనీ అడుగుతే. తనకి న్యాయంగా రావాల్సిన బహుమానాన్ని అడగటానికి సిగ్గూ, భయమూ ఎందుకూ?"

"నగపారేసుకొన్న వాళ్ళనే అడుగుతా" నసుకుని మనసులో అనుకుంటూ వాళ్లుదగ్గిరికి ఓ అడుగు ముందుకేసింది.

ఇంతలోకే ఆయన-"ఏయ్! ఎక్కడికి?" అన్నాడు కఠినంగా

"నా బహుమానం....!" అని అస్పష్టంగా అడిగింది శారద.

"బహుమానం" అనగానే ఏదో జ్ఞాపకం వొచ్చిన వాడిలా ఆయన గభాలున పరుగుతీసి ఓ పదిరూపాయల కాగితం తీసి, ఇందాక తనని స్టేజిదాకా చెయిపట్టుకుని తీసుకొచ్చినాయనకి ఇస్తూ,

"అన్నట్టు ఇందాకట్నుంచీ మాటలు సందర్భంలో మరిచిపోయాను. ఇదుగో వుంచండి" అని అన్నాడు.

"ఆఁ! ఏమిటీ అన్యాయం. ఆ బహుమానం తనకి రావద్దూ!"ఆశ్చర్యపోయింది శారద.

ఐనా ఆయనవైపు ఇస్తాడేమోనని ఆశగా చూస్తున్న చూపుల్ని చూసి ఆయనే,

"నీకు బహుమానము! వుండు పంపించాలే. ఈ పాటికి వొస్తూ వుండాలి" అని రోడువంక చూశాడు.

శారదకూడా ఏమిటో అని అటు చూసింది.

"పోలీసులు!" పెద్ద గుంపుతో వొస్తున్న పోలీసుల్ని చూసి శారద చిన్ని హృదయం వుక్కిరి బిక్కిరైంది.

తనకి రాగల బహుమానాన్ని గురించి తలుచుకొని, కళ్లు మూసుకొని ఆనంద బాష్పాలు రాల్చింది శారద.